క్లుప్తంగా

రేపు ప్రమాణ స్వీకారం

నవాబుపేట: జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన పర్వతాపూర్ మైసమ్మ ఆలయ చైర్మన్‌గా కాకర్లపహడ్ కు చెందిన కృష్ణయ్యను నియమించారు. ఈ మేరకు గురువారం అమ్మవారి సన్నిధిలో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారి మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్యను పలువురు అభినందించారు.

నేటి నుంచి వార్షికోత్సవాలు

నవాబుపేట: మండల కేంద్రంలో వెలసిన షిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవాలు బుధవారం నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఆలయ ట్రస్టీ బ్యాంగి రవీందర్, కార్యనిర్వాహకులు అనంతకృష్ణ మంగళవారం వివరాలు తెలియజేశారు. అధిక సంఖ్య పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల: ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య తెలిపారు. మంగళవారం 23వ రోజు కొనసాగిన సమ్మెలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సరస్వతీ, ఫాతిమా, రమాదేవి, వసియాబేగం, సరిత, గౌతమి, అలివేలు, కల్పన, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని కావేరమ్మపేటలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. మొదటి బొడ్రాయి ఊరేగింపు, గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, మంగళహారతులు, అన్నదానం చేయనున్నారు. రెండో రోజు ఉదయం ప్రాంతకాలపూజ, ఆవాహిత దేవత పూజ, మంగళహారతులు, అదేవిధంగా మూడో రోజు ఉదయం ప్రతిష్ఠ, శాంతిపూజ, కోటమైసమ్మ బోనాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

హక్కుల కోసం పోరాడుదాం

నారాయణపేట టౌన్: 'ఉపాధి' కూలీల హక్కుల కోసం పోరాడుదామని వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. మండలంలోని అమ్మిరెడ్డిపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని, కూలీలకు టెంట్లు ఇతర వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేపడుతామన్నారు.

చెక్‌పోస్టుల్లో ఆకస్మిక తనిఖీలు

నారాయణపేట: కర్ణాటక రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం నారాయణపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్, ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టులను సీఐ రవిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరిహద్దులో వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చెక్‌పోస్టుల్లో విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది, రెవెన్యూ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అక్రమంగా మద్యం, డబ్బు, చీరలు తదితర వస్తువులు ఏమైనా రవాణా చేస్తుంటే వాటిని పట్టుకోవాలని సూచించారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

నారాయణపేట టౌన్: అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని టీడీపీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు ఓం ప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో ధాన్యం తడిసి పంటనష్టం జరిగిన రైతులకు సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి ఎకరాకు రూ. 25 వేలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రాజ్యాంగ పుస్తకాలను పంపిణీ చేయాలి

కొత్తకోట రూరల్: దేశంలో ఉన్న పౌరులందరికీ రాజ్యాంగ పుస్తకాలను ఉచితంగా అందజేయాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) ఆధ్వర్యంలో మంగళవారం పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. దేశాన్ని నడిపిస్తున్న రాజ్యాంగం గురించి చాలా మందికి అవగాహన లేకనే పార్లమెంటరీ, ప్రజాస్వామ్యం విఫలమవుతుందని ఆందోళన చెందారు. ప్రజలందరికీ రాజ్యాంగం గ్రంథం ఉచితంగా పంపిణీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డీఎస్పీ డిమాండ్ చేసింది.

సత్తాచాటిన ప్రభుత్వ విద్యార్థులు



శ్యాం సుందర్(జడ్చర్ల కో ఎడ్యుకేషన్)



జాహ్నవి(మహబూబ్‌నగర్ మైనార్టీ గురుకుల)



నవనీత(చిట్టిబోయిన్ పల్లి గురుకుల)



తేజశ్రీ (చిట్టిబోయిన్ పల్లి గురుకుల)



జిల్లా కేంద్రంలో ఫలితాలు చూసుకుంటున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాలలో సత్తా చాటారు. కో ఎడ్యుకేషన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శంకర్ బైపీసీలో 964, సూర్యచారి ఎంపీసీలో 935, సమీర్ సీఈసీలో 872, అరుణ్ వొకేషనల్‌లో 821, చంద్రశేఖర్ ఈటీలో 921 సాధించారు. ప్రథమ సంవత్సరం వొకేషనల్ ఈటీలో శ్యాం సుందర్ 495, సానియా బైపీసీలో 418మార్కులు సాధించారు. బాలికల కళాశాలలో బైపీసీలో తబసుమ్ 936, ఎంపీసీలో ఉమైమా 935, బైపీసీ ఉర్దూమీడియంలో కౌసర్ 940, సీఈసీలో పావని 907మార్కులు సాధించారు. వొకేషనల్‌లో శాంతి 963, విజయ 943 మార్కులు సాధించగా, మొదటి సంవత్సరం విద్యార్థి వెన్నెల 481మార్కులు సాధించింది. మొత్తం సెకండ్ ఇయర్‌లో 200మందికి 132మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో 249మందికి 144మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల మైనార్టీ కళాశాలలో ఎంపీసీలో భార్గవి 974, ఫర్హాశిరీన్ 971 మార్కులు సాధించారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో పి. భార్గవి 453, సానియా 420మార్కులు సాధించారు.

మండల టాపర్‌గా నవనీత

చిట్టిబోయిన్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన నవనీత బైపీసీలో 990మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఇదే కళాశాలలో ఎంపీసీలో తేజశ్రీ 983మార్కులు సాధించింది. మొదటి సంవత్సర విద్యార్థుల్లో డి. కృప 432మార్కులు, ఎంపీసీలో లావణ్య 461 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

అడ్డాకుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో రెండో సంవత్సరంలో 60 శాతం, మొదటి సంవత్సరంలో 51.76శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో కె.సంధ్య 937, బైపీసీలో ఇందిర 918, సీఈసీలో నాగరాజు 813 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం బైపీసీలో దీపిక 409 మార్కులు, నందిని 402 మార్కులు, ఎంపీసీలో గాయత్రి 378 మార్కులు సాధించారు.

భూత్పూర్ : జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. 136 మందికి 134 మంది ఉత్తీర్ణత సాధించారని స్పెషల్ ఆఫీసర్ బస్వరాజ్ గౌడ్ తెలిపారు. బైపీసీలో ఉమాదేవి 979 సాధించగా, మొదటి సంవత్సరం బైపీసీలో 434 మార్కులతో రేణుక, పల్లవి, మాధురి రాణించారు. అదేవిధంగా ఎంపీసీలో శిరీష 464 మార్కులు సాధించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీలో శివలీల 826, శ్రీవల్లి 801, బైపీసీలో హైమావతి 911, సంధ్యారాణి 877, సీఈసీలో శివాని 848, అజయ్ 770, ఫస్టియర్ ఎంపీసీలో శ్రీవాణి 352, బైపీసీలో మహేశ్వరి 389, సీఈసీలో దామోదర్ 304 మార్కులు సాధించారు.

మిడ్జిల్: ఇంటర్ ఫలితాలలో మిడ్జిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 128 మందికి గాను 107 మంది ఉత్తీర్ణత సాధించగా ,83శాతం ఉత్తీర్ణత నమోదు అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య తెలిపారు. ఎంపీసీలో భూమిక 864, బైపీసీలో సింధు 949, సీఈసీలో వినోద్ కుమార్ 716 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచారు. ప్రథమ సంవత్సరంలో 147 మందికి గాను 121 ఉత్తీర్ణత సాధించగా 95 శాతం ఉత్తీర్ణత నమోదు అయినట్లు తెలిపారు .ఎంపీసీలో అర్చన 399, బైపీసీలో దాస్‌రాంనాయక్ 401 , సీఈసిలోఅఖిల 419 మార్కులతో టాపర్‌గా నిలిచారు. అదేవిధంగా కొత్తూర్ గ్రామానికి చెందిన జాహ్నవి మొదటి సంవత్సరం ఎంపీసీలో 467 మార్కులు సాధించి, స్టేట్ ర్యాంకర్‌గా నిలిచారు. ఆమె మహబూబ్‌నగర్ లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతోంది.

బాలానగర్ : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో 161 మందికి 160 మంది విద్యార్థులు ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో 986, 985, 983 మార్కులతో.. బైపీసీలో 985, 985, 981 మార్కులతో విద్యార్థులు సత్తా చాటారు. ఏకలవ్య గురుకులలో మొదటి సంవత్సరంలో 87 మందికి 74 మంది, ద్వితీయ సంవత్సరంలో 86 మందికి 84 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి తెలిపారు.

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 172 మందికి 132 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు.
- కస్తూర్బా మొదటి సంవత్సరంలో 67 మందికి 33 మంది, ద్వితీయ సంవత్సరంలో 56 మందికి 49 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి తెలిపారు.

నవాబుపేట: యన్మన్‌గండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 87 శాతం ఉతీర్ణత నమోదైంది. బైపీసీలో షామీమ్ 956 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. అదేవిధంగా అనుష 950 మార్కులతో ద్వితీయ స్థానం, సాయి కిరణ్ ఎంపీసీలో 940 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. మొదటి సంవత్సరంలో అఖిల 435 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు.

గురుకుల విద్యార్థుల హవా..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండల పరిధిలోని రాంరెడ్డి గూడెం ఎస్సీ గురుకుల కళాశాల విద్యార్థులు ఫలితాల్లో సత్తా చాటారు. సీఈసీలో నవ్యశ్రీ 977 మార్కులు సాధించింది. రెండో స్థానంలో డి. నవ్యశ్రీ 945 మార్కులు సాధించింది. ఇంటర్ రెండో సంవత్సరంలో 87శాతం ఉత్తీర్ణత, మొదటి సంవత్సరంలో 72శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వాణిశ్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



నవ్యశ్రీ

- జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఈమేరకు బైపీసీలో సయ్యదా ఖనాజ్ ఫాతిమా 979 మార్కులు, బుష్రా కౌసర్ 974, ఒకేషనల్ విభాగం మొదటి సంవత్సరంలో రిషిక 492, ఎంపీసీ విభాగంలో ఆల్‌నూర్ సోహా 457 మార్కులు సాధించారు. ప్రిన్సిపాల్ కౌసర్ జహాన్, అధ్యాపకులు మాజీహాత్ నదీమ్, జహంగీర్‌ఆలీ, నిజాం తదతరులు అభినందించారు.

పోటీలను సద్వినియోగం చేసుకోండి

కోయిల్‌కొండ: మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఈ నెల 15,16,17 తేదీల్లో నిర్వహిస్తున్నామని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలస్థాయి పోటీల్లో కబడ్డీ, ఖోఖో, పుట్‌బాల్, వాలీబాల్ తదితరాలు ఉంటాయన్నారు. 15- 36 సంవత్సరాల వయసు ఉన్న క్రీడాకారులు ఈ పోటీలకు అర్హులని వారు తెలిపారు. ఆసక్తి వారు ఈ నెల 10వ నుంచి 12వ తేదీ లోపు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పేరునమోదు చేయించాలని కోరారు. మండల ప్రత్యేకాధికారి మధుసూదన్‌గౌడ్, తహసీల్దార్ ప్రేమ్‌రాజ్, ఎంపీడీఓ జయరాములు, ఎంపీఓ శ్రీదేవి, ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'దేవరకద్రకు చేసింది ఏమిలేదు'

దేవరకద్ర: బీఆర్ఎస్ నాయకులు హంగు ఆర్భాటంతో ఇద్దరు మంత్రులతో ఆర్వోబీకి సర్వీసు రోడ్లు లేకుండానే ప్రారంభించారని మండల బీజేపీ అధ్యక్షుడు కొండ అంజన్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్వోబీకి మహబూబ్‌నగర్ నుంచి వస్తుంటే ఎడమ వైపు సర్వీసు రోడ్డు లేదని, అలాగే రాయచూర్ వైపు నుంచి వస్తుంటే కుడివైపు సర్వీసు రోడ్డు లేదని దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. దేవరకద్రకు చేసింది ఏమిలేదని మంజూరయిన స్టేడియం పెండింగ్‌లో ఉందని, వ్యవసాయ అధికారి కార్యాలయం లేక రైతు వేదికలో ఉన్నారని, ఫైర్ స్టేషన్ లేదని ఆరోపించారు. ఒక్క డబుల్ బెడ్‌రూం కూడా నిర్మించలేదని, గురుకులాలకు సొంత భవనాలు లేవని, పోయిన డిగ్రీ కళాశాలను తిరిగి దేవరకద్రకు తీసుకురావాలని అన్నారు. మోదీని విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదని మండిపడ్డారు. నాయకులు చంద్రశేఖర్, రాజు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

హన్వాడ: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నాయకులు మంగళవారం అన్నారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కమలం గుర్తును ప్రతీ కార్యకర్త ఇంటి గోడకు చిత్రిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, ఉపాధ్యక్షుడు కృష్ణవర్ధన్ రెడ్డి, ఇన్‌చార్జ్ సుబ్రమణ్యం, మండల అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దేవరకద్ర: గుడిబండ్ సమీపంలోని వాగు నుంచి మంగళవారం లాల్‌కోట గ్రామానికి చెందిన రామాంజనేయులుకు సంబంధించిన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. పోలీస్ స్టేషన్ తరలించి సీజ్ చేశామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

బ్యాగుల పంపిణీ

పాలమూరు: ప్రపంచ రెడ్‌క్రాస్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని సన్నిధి ఆశ్రమంలోని విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, డాక్టర్ శ్యామూల్, కోశాధికారి జగపతిరావు, రమణయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం అందజేత

అడ్డాకుల: బలీదుపల్లిలో విగ్రహాల ప్రతిష్ఠ కోసం పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి రూ.1,01,116 అందజేశారు. గ్రామంలోని దేవాలయం వద్ద గణపతి, లోకేశ్వరస్వామి, సీతారాములు, కురుమూర్తిస్వామి, దీపస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాలు ఈనెల 14న చేపట్టనున్నారు. ఈ క్రమంలో నగదు అందజేసిన ఎంపీపీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ గణేష్, సత్యారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మస్థైర్యం

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటేతో ఆత్మస్థైర్యం పెరుగుతుందని మాస్టర్ కేశవ్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ కేశవ్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రం సంతోష్‌నగర్‌లోని శ్రీ శ్రేష్ఠ స్కూల్‌లో వేసవి కరాటే శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల విద్యార్థులు సంప్రదించాలని కోరారు.

హన్వాడలో బోనాల వేడుక



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

హన్వాడ: మండలకేంద్రంలో బొడ్రాయి ఉత్సవాలను స్థానికులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పోచమ్మ ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సర్పంచ్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో అక్రమ కట్టడాల తొలగింపు కార్యక్రమం కొనసాగుతోంది. తాజాగా మంగళవారం స్థానిక న్యూమోతీనగర్ (వార్డు నం.35) లోని ఓ ఆర్‌సీసీ బిల్డింగ్, రేకులషెడ్డుతో పాటు మరో బేస్‌మెంట్‌ను కూల్చివేశారు. ఈ మూడింటికీ మున్సిపల్ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతి లేదు. వాస్తవానికి 1977లో ఇక్కడ నాలుగోతరగతి (ల్యాండ్ సర్వే విభాగం) ఉద్యోగులు 32 మందికి 200 గజాల చొప్పున స్థలం కేటాయించారు. అయితే వేరేవారు ఆ తర్వాత ఆక్రమించి 100 గజాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టగా ముగ్గురు బాధితులు ఇటీవల డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ టీం (డీటీఎఫ్‌టీ) కు ఫిర్యాదు చేశారు. దీంతో 15 రోజుల క్రితం బాధ్యులకు నోటీసులు ఇచ్చినా ఎలాంటి స్పందన లేకపోవడంతో వీటిని కూల్చి వేయించారు. అలాగే బండమీదిపల్లి లోనూ ఇలాంటి మరో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలంటూ అధికారులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఇది కూడా నాలుగోతరగతి ఉద్యోగికి కేటాయించగా వేరేవారు ఆక్రమించుకోవడం గమనార్హం. ఇదిలాఉండగా శివశక్తినగర్ లోని పెద్దనాలాను ఆక్రమించి ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టగా ఈనెల 6న డీటీఎఫ్‌టీ నిలిపివేయించింది. గత మార్చిలోనూ వార్డు నం.3 పరిధిలోని ఎనుగొండ-బీసీకాలనీలో పార్కుకు కేటాయించిన స్థలంలో ఓ వ్యక్తి అక్రమ నిర్మాణాలు చేపడుతుండగా అధికారులు తొలగించిన విషయం విదితమే.



న్యూమోతీనగర్‌లో బేస్‌మెంట్ తొలగింపజేయిస్తున్న అధికారులు

మెప్మా ఆర్పీలతో సమీక్ష

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం మెప్మా రీసోర్స్ పర్సన్‌లతో కమిషనర్ మహమూద్‌షేక్, డీఎంసీ శివకుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో రుణాలు, రీకవరీలపై అడిగి తెలుసుకున్నారు. స్ట్రీట్ వెండర్స్ రుణాల గురించి చర్చించారు. హోం కంపోస్టింగ్‌పై ఆరా తీశారు. స్ట్రీట్ వెండర్స్ రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలని, హోం కంపోస్టింగ్‌పై దృష్టిసారించి ప్రజలకు అవగాహన కల్పించాలని వారు సూచించారు.



సమీక్షలో పాల్గొన్న ఆర్పీలు తదితరులు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్ఐ మాధవరెడ్డి

అడ్డాకుల: సైబర్ నేరాలపై అవగాహన అవసరమని అడ్డాకుల ఎస్ఐ మాధవరెడ్డి అన్నారు. మండలంలోని వర్నెలో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని, ఓటీపీలను ఎవరికీ తెలపవద్దని సూచించారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అదేవిధంగా గ్రామంలో బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి స్మారకార్థం ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



పగిడ్యాల్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గండేడ్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. పల్లెబాటలో భాగంగా మంగళవారం గండేడ్ మండల పరిధిలోని పగిడ్యాల్, బల్సూర్‌గొండ, తువ్వగడ్డ తండా, పరుగుల తండా, పంచాంగాల్ తండా తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లను, వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. పగిడ్యాల్‌లో బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందని వారి అభివృద్ధి కోసం వివిధ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. తువ్వగడ్డ తండాకు బీటీ రోడ్డు వేయించాలని కోరాగా ఎమ్మెల్యే త్వరలోనే ఏర్పాటు చేయిస్తామన్నారు. కాగా కొండాపూర్‌లో సర్పంచ్ శ్రీనివాస్ ఏర్పాటు చేసిన సభాస్థలికి ఎంపీటీసీ బాలమ్మ వర్గీయులు రాలేదు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య , తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

హన్వాడ: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ యాదయ్య పేర్కొన్నారు. ఇబ్రహీంబాద్, తిరుమలగిరి, వేపూర్, గొండ్యాల్, యారోనిపల్లి గ్రామాల్లో మంగళవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. జిల్లా రైతుబంధు డైరెక్టర్ లక్ష్మయ్య, ఎఫ్‌పీసీఎస్ వైస్‌చైర్మన్ కృష్ణయ్యగౌడ్, తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఏఓ కిరణ్‌కుమార్, నాయకులు రమణారెడ్డి, అనంతరెడ్డి, జంబులయ్య సర్పంచ్‌లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌చాలీసా పారాయణం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ చౌరస్తాలో మంగళవారం రాత్రి విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని ప్రకటించడాన్ని నిరసిస్తూ పారాయణం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విభాగ్ కార్యదర్శి నరేందర్, సత్సంగ్ ప్రముఖ్ రాచాల జనార్దన్, జిల్లా కార్యదర్శి నలిగేశి లక్ష్మీనారాయణ, బజరంగ్‌దళ్ నాయకులు సురేష్, కుమార్, హన్మంతు, శ్రీధర్‌బాబు, బుట్టి శ్రీనివాస్, భద్రప్ప, భరత్‌కుమార్, వర్మ, కొండల్ తదితరులు పాల్గొన్నారు.



పారాయణలో పాల్గొన్న నాయకులు

బీభత్సం సృష్టించిన గాలివాన



అన్నాసాగర్‌లో పడిపోయిన కోళ్ల షెడ్డు

మహబూబ్‌నగర్ రూరల్ : మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అక్కడక్కడ చెట్లు విరిగిపడ్డాయి. అల్లీపూర్‌కి వెళ్లే దారిలో 11 కేవీ విద్యుత్ వైర్లపై చెట్లు విరిగిపడటంతో కోడూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని జమిస్తాపూర్, ధర్మాపూర్, బొక్కలోనిపల్లి, అప్పాయిపల్లి, కోటకదిర, కోడూర్ తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు రాత్రి వరకు సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది ప్రయత్నిస్తూనే ఉన్నారు. అకాల వర్షం తన ప్రభావాన్ని చూపుతూనే ఉండటంతో వరి కోతలు, ధాన్యం విక్రయాలకు ఇబ్బందిగా మారింది.

హన్వాడ: మండల పరిధిలోని బుద్దారంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన గాలివాన బీభత్సాన్ని సృష్టించింది. గ్రామానికి విద్యుత్ సరఫరాను అందించే విద్యుత్ స్తంభాలు పలుచోట్ల నేలకూలగా, మరికొన్ని చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. గ్రామంలో పలు ఇళ్ల పాక్షికంగా దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం అలుముకుంది. స్థానిక నాయకులు పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను, పరిసర ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. బాధి తులకు ప్రభుత్వం నుంచి సాయం కోసం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

భూత్పూర్ : మండలంలోని రావులపల్లి, అన్నాసాగర్ గ్రామాలల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులకు చెట్లు, కోళ్ల ఫారం షెడ్డు నెలకొరిగాయి. రావులపల్లిలో వ్యవసాయ పొలాల్లో ఉన్న కరెంట్ వైర్లు, ఇళ్ల ఎదుట ఉన్న చెట్లు కిందపడిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అన్నాసాగర్‌లో గ్రామానికి చెందిన మన్యపురెడ్డి తన కోళ్ల ఫారం షెడ్డు గోడలతో సహా రేకులు పడిపోవడంతో దాదాపు రూ.15లక్షల మేర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పొలాలల్లో వైర్లు వేలాడడంతో వరి కోతకు ఇబ్బందిగా మారిందని సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ అధికారులు వైర్లను సరిచేయాలని కోరారు.



సుంకరాంపల్లిలో నేలకొరిగిన స్తంభం

అడ్డాకుల: మండలంలోని సుంకరాంపల్లిలో మంగళవారం సాయంత్రం విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఒక్కసారిగా వచ్చిన ఈదురు గాలుల తాకిడికి రెండు చోట్ల ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు పేర్కొన్నారు.